క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మ తల్లి జాతర ప్రారంభం


చల్లకుండ తలపై మోస్తూ ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం నారాయణ పురం కాలనీ గ్రామ దేవతగా, కోరిన కోరికలు నెరవేర్చే తల్లిగా పూజలందుకుంటున్న సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళ వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మొదలైన అమ్మవారి 24వ జాతర మహోత్సవ ప్రారంభ కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే జక్కం పూడి రాజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఈ జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వ హించడం అభినందనీయమన్నారు. దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు ఆధ్వర్యం లో ఆలయ నిర్మాణం చేపట్టారని, అప్పటి నుం చి ఏటా ఈ జాతర మహోత్సవాల్లో తమ కుటుంబం విధిగా పాల్గొంటోందన్నారు. ఈ నెల 13న జాతర ముగింపు సందర్భంగా మహాన్నదానం జరుగుతుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కడియం: మండలంలోని కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియే షన్ కార్యాలయం వద్ద మంగళవారం చలివేం ద్రాన్ని ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు మల్లు పోలరాజు, ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు, పాలకవర్గ సభ్యులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

మందుబాబుల ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు

సీతానగరం: మద్యం మత్తులో కొందరు మందు బాబులు ఘర్షణ పడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రఘుదేవ పురానికి చెందిన పసలపూడి రామకృష్ణ గ్రామం లోని బ్రాందీ షాపు వద్ద మద్యం సేవించి ఉన్నాడు. మద్యం మత్తులో ఉన్న అదే గ్రామానికి చెందిన కొందరు రామకృష్ణ వద్దకు వచ్చి మోటార్ సైకిల్‌ను అడ్డుతీయమని చెప్పారు. మోటార్ సైకిల్ ఎవరిదో తనకు తెలియదని రామకృష్ణ సమాధానమిచ్చాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్తా ఘర్షణకు దారితీయడంతో.. రామకృష్ణ తలపై రాయితో దాడి చేశారు. తీవ్రంగా గాయప డిన రామకృష్ణను అతడి కుటుంబ సభ్యులు అం బులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఈ సంఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు చెప్పారు.

వృద్ధ ఖైదీ మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పోక్సో యాక్ట్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న వృద్ధ ఖైదీ పి.వెంకటేశ్వరరావు (80) అనారోగ్యంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇతనికి పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష పడగా, ఏడాది క్రితం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి వచ్చాడు. వృద్ధాప్యం కారణంగా ఇతడు అనారోగ్య సమస్యలతో బాధప డుతున్నాడు. సోమవారం రాత్రి అతను గుండె పోటుతో బాధపడుతుండగా, ప్రాథమిక చికిత్స అందించిన జైలు వైద్యులు పరిస్థితి విష మిస్తుండడంతో ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయి నట్టు జైలు అధికారులు తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురు అరెస్టు

సీతానగరం: రఘుదేవపురం, శ్రీరామనగరంల్లో మంగళవారం కోడిపందాలు నిర్వహిస్తున్న ఆరు గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై టి.రామకృష్ణ కథనం ప్రకారం.. రఘుదేవపురం చింతాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో కోడిపందేలాడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.2,300, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రాపాక పంచాయతీలోని శ్రీరామనగరంలో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.3,400, రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

సినిమాలు

శ్యామల	: ది ఫ్యామిలీ స్టార్
సూర్యమినీ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
సూర్యప్యాలెస్	: మంజుమ్మల్ బాయ్స్
స్వామి	: ది ఫ్యామిలీ స్టార్
శివజ్యోతి	: ది ఫ్యామిలీ స్టార్
అనుశ్రీ	: మంజుమ్మల్ బాయ్స్
రాజా	: ది ఫ్యామిలీ స్టార్
ఊర్వశి	: ఓం భీమ్ బుష్
రంభ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
మేనక	: భరత నాట్యం
అప్సర	: టిల్లు స్క్వేర్
కుమారి	: టిల్లు స్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	: ది ఫ్యామిలీ స్టార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ది ఫ్యామిలీ స్టార్, టిల్లు స్క్వేర్
కడియం	
వెంకటసూర్య	: ది ఫ్యామిలీ స్టార్

కొంగొత్త హంగులతో..

- రూ.2 కోట్లతో ఆధునీకరిస్తున్న గాంధీ పార్కు
- శరవేగంగా నిర్మాణ పనులు
- ఈ నెల చివరి వారంలో అందుబాటులోకి..!


పార్కు డిజిటల్ చిత్రం


నిర్మాణంలో ఉన్న క్లాక్ టవర్


పార్కులో చిన్నారుల ప్లే గ్రౌండ్


సిద్ధమవుతున్న కప్పు-సాసర్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగ రపాలక సంస్థ ఆధ్వర్యంలో దానవాయిపేట గాంధీ పార్కు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. రూ.రెండు కోట్ల నగరపాలక సంస్థ నిధులతో గాంధీ పార్కు ఆధునీకరణ, పునర్నిర్మాణ పనులు శరవే గంగా సాగుతున్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న ఈ పార్కు సుమారు రెండు ఎకరాల్లో విస్తరించి ఉం డగా, ఇందులోని కొంత భాగంలో చిన్నారులకు స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ పార్కు, దానవాయిపేట గ్రంథాలయం నిర్మించారు. మిగిలిన ఎకరా 20 సెంట్ల విస్తీర్ణంలో నిత్యం దానవాయిపేట, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వాకింగ్ చేసేందుకు, సాయంత్రం వేళల్లో సేదతీరేందుకు ఏర్పాటు చేశారు.

ఆధునీకరణకు చర్యలు

ఇటీవల నగర సుందరీకరణలో భాగంగా గాంధీ పార్కును ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టారు. పార్కులో ఆధునిక హంగులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. పూర్తి స్థాయిలో ఆధునీకరించి ఈ పార్కును ఏప్రిల్ చివరి వారంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు. గాంధీ పార్కు ఆధునీకరణలో భాగంగా ప్రత్యేక క్లాక్ టవర్, అంబ రిల్లా షెల్టర్, మ్యూజిక్ ఎలిమెంట్, సిట్టింగ్ ఏరియా, కిడ్స్ ప్లేగ్రౌండ్, గాంధీ విగ్రహం, ట్రీ సిట్టింగ్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. దీంతో పాటు పార్కులో అత్యాధునిక విద్యుత్ లైటింగ్‌ను నెలకొల్పనున్నారు. ఈ పార్కులో వాకింగ్ ట్రాక్‌తో పాటు, ఎంట్రన్స్ గేట్‌ను ఆధునికంగా తయారు చేస్తున్నారు. దీంతో పాటు పార్కు పహరీని ఆకర్షణీ యంగా నిర్మిస్తున్నారు. పార్కులో చిన్నారులు ఆట లాడుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చిన్నా రులకు ఏవిధమైన ఇబ్బందుల్లేకుండా సింథటిక్ ఫ్లోర్‌నూ ఏర్పాటు చేశారు.

అద్భుతంగా రూపుదిద్దుకుంటోంది



నగరంలో గాంధీ పార్కు ప్రత్యేకంగా తయారు కానుం ది, అద్భుతంగా రూపుదిద్దు కుంటున్న ఈ పార్కు నగ రానికే తలమానికం కానుంది. చిన్నారుల మొదలు అన్ని వర్గాల వారినీ ఆకట్టుకునేలా తయారవుతోం ది. దానవాయిపేట ప్రాంతానికి ఇది వన్నె తేనుం ది. గాంధీ పార్కు నగరంలో ఏకైక అద్భుతమైన పార్కు ఇది.

– సీహెచ్ సూర్యకుమారి, గృహిణి

ఆకట్టుకునేలా ఉంది



నూతనంగా తయారవుతున్న గాంధీ పార్కు అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా సిద్ధ మవుతోంది. ప్రత్యేక హంగులతో తయారవుతున్న ఈ పార్కు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం అందించే విధంగా తయారు కానుంది. రూ.రెండు కోట్లతో దీనిని ఆధునీకరించి, త్వరలోనే అందుబా టులోకి రానుండడం ఆనందంగా ఉంది.

– శెనగల వసంత వంశీకృష్ణ, విద్యార్థి

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం


కడియపులంకలో తీర్థ మహోత్సవానికి తరలివచ్చిన గ్రామస్తులు

కడియం: కడియపులంక గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు మంగళ వారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుం చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో హాజరై, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకు న్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఆసిరమ్మ తల్లి అమ్మవారి ఘటాభిషేకం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పం చాయతీ వెంకటగిరి-2లో ఆసిరమ్మ తల్లి అమ్మవారి ఘటాభిషేకం తనుబుద్ధి సూర్యభాస్క రరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ముందుగా గ్రామంలోని ఆలయాలను ఊరేగింపుగా భక్తులతో దర్శించుకుని, అనంతరం గ్రామ అడపడుచులందరితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భాగం గా ఆర్ఎస్ఎస్ నేత డా.కేశవరావు బలిరాం హెడ్గే జయంతి ఉత్సవం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకూ మేలు


పార్టీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకూ మేలు జరుగుతోందని మంత్రి, పార్టీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం బొమ్మూరులోని రూరల్ నియోజకవర్గ పార్టీ కార్యాల యంలో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో హుకుంపేట ఆదర్శనగర్‌కు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి వేణుగోపాలకృష్ణ పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. అలాగే 28వ డివిజన్ ఇన్‌చార్జి బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీలో చేరగా, మంత్రి వేణుగోపాలకృష్ణ పార్టీ కండువాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి డా.గూడూరి శ్రీనివాస్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని..

మంత్రి వేణు కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు


పండితుల ఆశీర్వచనాలు అందుకుంటున్న మంత్రి వేణుగోపాలకృష్ణ


హాజరైన రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులు

రాజమహేంద్రవరం రూరల్: తెలుగు నూతన క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు బొమ్మూరు గ్రామంలో ఉన్న మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లు బోయిన వేణు గోపాలకృష్ణ క్యాంపు కార్యాలయం లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు, ఆయన తనయులు నరేన్, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేద పండితులు శాస్త్రోక్తంగా విశేషార్చ నలు, అభిషేకాలు జరిపించారు. అనంతరం పం చాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ ప్రజలకు ఉగాది శుభాకాం క్షలు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేలా ఆ దేవుని కరుణా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు, విజయాలు సిద్ధించాలని ప్రార్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరింత శక్తిని, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని వేడు కున్నారు. ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవాల ని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉం డాలన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళ లాడాలని, సంస్కృతీ సంప్రదాయాలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అఖండ విజయం సాధిం చి, మరోసారి సీఎం కావాల్సిన అవసరం చాలా ఉందన్నారు. సీఎం జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసుల రెడ్డి, పార్టీ పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు గిరిజాల బాబు, నగరపాలక సంస్థ డివిజన్ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, జేసీఎస్ ఇన్‌చార్జిలు తాడాల చక్రవర్తి, కొప్పిశెట్టి ప్రసాద్‌బాబు(రాజ మౌళి), ఆయా రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు దొంతం శెట్టి చినవీరభద్రయ్య, ముద్దాల అను, అంగాడి సత్యప్రియ, జిల్లా దివ్యాంగులసెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, డివిజన్ల ఇన్‌చార్జిలు, మాజీ ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నియోజకవర్గ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పట్టు ప్రదర్శన

వైభవంగా నందన్న తీర్థ మహోత్సవం


ప్రథమ స్థానాన్ని దక్కించుకున్న ఎడ్ల జత

కడియం: మురమండ గ్రామంలోని వీరవరం–దుళ్ల రోడ్డులో ఉన్న నందన్నబాబు ఆలయం వద్ద మంగ ళవారం ఎడ్ల పట్టు ప్రదర్శన ఉత్సాహభరితంగా సాగింది. ఉగాది పండగ రోజున ఏటా నందన్న తీర్థ మహోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎడ్ల పట్టు ప్రదర్శనను నిర్వహిస్తారు. అందులో భాగంగా 200 కేజీల బరువును 110 గజాల దూరం లాగేందుకు ఎడ్ల జతలు పోటీపడ్డాయి. మొత్తం 16 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని నిర్వాహ కులు తెలిపారు. ఈ పోటీల్లో కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన మిద్దే సురేష్‌కు చెం ది ఎడ్ల జత 21.03 సెకన్లలో నిర్ణీత గమ్యానికి చేరి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చెందిన ముంగర నాగేశ్వరరావు ఎడ్ల జత 23.16 సెకన్లతో ద్వితీయ స్థానంలోను, ముల్లేరుమల్లవరం గ్రామా నికి చెందిన మేడివెట్టి శ్రీను ఎడ్ల జత23.25 సెకన్లతో తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. అలాగే మురమండ గ్రామానికి చెందిన కురసాల లలితేష్ ఎడ్లు 24.62 సెకన్లతో నాలుగో స్థానంలో నిలి చాయి. విజేతలకు నగదు బహుమతులతో పాటు, జ్ఞాపికలను అందజేశారు. ప్రతి జట్టుకు ప్రోత్సా హక బహుమతిని నిర్వాహకులు అందించారు. న్యాయ నిర్ణేతలుగా మొగలపు వెంకటరామకృష్ణా రావు, వై.రమేష్ వ్యవహరించారు. మొగలపు హరి శ్చంద్ర ప్రసాద్, వట్టికూటి జానకిరామ్, కొరపాటి చిన్నా, ముత్యాల సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, రైతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నగదు బహుమతులను రేవంత్ జ్ఞాపకార్థం అం దజేశారు. కాగా ఏటా ఉగాది పర్వదినం సందర్భం గా నందన్నబాబు తీర్థం అత్యంత వైభవంగా జరుగుతుంది. తీర్థ మహోత్సవానికి కడియం, ఆలమూరు మండలాల ప్రజలు తరలివస్తారు. పచ్చని పొలాల మధ్య కొలువుదీరిన నందన్నను దర్శించుకుని, తమ పాడిపంటలు సమృద్ధిగా ఉం డాలని మొక్కులు చెల్లించుకుంటారు.

విశ్వాసంతోనే దైవ భక్తి

ఇఫ్తార్ విందులో మంత్రి వేణుగోపాలకృష్ణ


మసీదులో ప్రార్థన చేస్తున్న మంత్రి వేణు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నమ్మిన దైవంపై విశ్వాసం, భక్తి ఉండాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లు బోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఖాదరియా మసీ దులో రంజాన్ సందర్భంగా జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ ముస్లింలు పవిత్ర మాసంలో నిర్వహిం చే కఠోర ఉపవాసం అల్లాపై ఉన్న భక్తికి నిదర్శనమ న్నారు. అల్లా ఆదేశం ప్రకారం ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు కొనసాగిస్తూ, తమకున్న దానిలోనే ఇతరులకు సహాయం చేస్తూ దాతృత్వాన్ని, మానవత్వాన్ని చాటుకుంటారన్నారు. ఇటువంటి సహృదయం ప్రతిఒక్కరిలోనూ ఉండాలని మంత్రి వేణు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, చాపారాజా, కుడిపూడి గిరి, ఓదూరి రామకృష్ణ, కోడమళ్ల ప్రకాష్, షేక్ ఖాదర్‌బాషా, టింకు, సీతయ్య, జంపా పండు, కేతా గణేష్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

జాతర ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్

రాజమహేంద్రవరం రూరల్: ఐదేళ్లకోసారి ప్రతిష్టా త్మకంగా జరిగే దండు గంగాలమ్మ, పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ప్రశాంతంగా, భక్తితో నిర్వహించుకోవాలని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ సూచించారు. సోమవారం రాత్రి రాజవోలు గ్రామంలో ఈ నెల 11 నుంచి 14 వరకూ జరిగే దండు గంగాలమ్మ, పోలే రమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహిం చారు. డీఎస్పీతో పాటు, రూరల్ తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ధవళేశ్వరం ఇన్‌స్పెక్టర్ జీవీ వినయ్‌మో హన్, ఎస్సై హరిబాబు, ఆలయ నిర్వాహక కమిటీ పెద్దలు, కుల, గ్రామ పెద్దలు. ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా అనేక సూచనలు చేశారు. బైక్‌లతో పెద్ద శబ్దాలు చేసే వారిపై వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అశ్లీల నృత్యాలు, జూదాలు నిషేధమని స్పష్టం చేశారు. అను మానాస్పద వ్యక్తులపై స్థానిక పోలీసులకు లేదా 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా గ్రామంలోని ప్రశాంత వాతావరణానికి విఘాతం కలి గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని డీఎస్పీ అంబికాప్రసాద్ కోరారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

కంబాలచెరువు: వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటనపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఆసుభ ప్రభుసాగర్‌కు, నాగజ్యోతి (33) కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అప్పటినుంచి అదనపు కట్నం కోసం ఆమెపై వేధింపులు జరుగుతున్నట్టు పోలీసులు తెలిపారు. మంగళవారం నాగజ్యోతి చని పోయిందని ఆమె తల్లిదండ్రులకు భర్త ఫోన్ చేసి చెప్పాడు. వారు వచ్చి చూడగా నాగజ్యోతి మెడపై కమిలిన గాయాలు కనిపించాయి. కట్నం కోసం తమ అల్లుడు వేధించి హతమార్చి ఉంటాడని వారు ఆరోపించారు. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభు త్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దేవుని కరుణా కటాక్షాలతో..


ఉగాది వేడుకలో పూజలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, మోనా దంపతులు


గూడూరి శ్రీనివాస్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నేతలు

- ఆనందోత్సాహాల మధ్య క్రోధి నామ ఉగాది వేడుకలు
- ఎంపీ భరత్ కార్యాలయంలో విశేష పూజలు
- ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: తెలుగు నూతన క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు రాజమ హేంద్రవరం ఎంపీ కార్యాలయంలో అత్యంత వైభ వంగా నిర్వహించారు. మంగళవారం ఎంపీ భరత్ రామ్, మోనా దంపతులు పాల్గొనగా వేద పండి తులు శాస్త్రోక్తంగా విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఏటా మాదిరిగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరున, ఆయన గోత్ర నామాలతో పూజాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా ఆ దేవుని కరుణా కటాక్షాలు ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్టు తెలిపారు. అదేవిధం గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరిం త శక్తిని, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థించినట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించి, వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డి మరోసారి సీఎం కావాల్సిన అవసరం చాలా ఉందన్నారు. సీఎం జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఆయన అధికారంలోకి వస్తేనే సం క్షేమ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే జగనన్న విజయం అవసరమనే విషయం ఇప్పటికే ప్రజలు గుర్తించారన్నారు. జగనన్న గెలిచేందుకు పార్టీరహి తంగా ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలుగు నూతన సంవత్సరంలో జగనన్నకు ఎన్నో అనుకూల పరిస్థితులు బలంగా ఉన్నాయని చెప్పారు. కార్యక్ర మంలో ఎంపీ భరత్ తల్లిదండ్రులు మార్గాని నాగేశ్వ రరావు, తులసి దంపతులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి కార్యాలయంలో..

రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఎన్నికల కార్యాలయంలో ఉగాది వేడుకలు జరి గాయి. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతో షాలతో ఉండాలని దేవుని కోరుకుంటూ, మరింత ప్రజారంజక పాలన చేసేలా జగనన్నకు ప్రజలంతా ఆశీస్సులు అందించాలని ఆకాంక్షించారు. సంప్రదా యబద్ధంగా జరిగిన క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం లో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, సిటీ నియోజకవర్గ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, రాష్ట్ర తెలుకుల గాండ్ల కార్పొరే షన్ చైర్‌పర్సన్ సంకిశ భవానీప్రియా, రాష్ట్ర ఇండ స్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కానుబో యిన సాగర్, లిడ్‌క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ తగరం సురేష్, మాజీ ఫ్లోర్‌లీడర్, పోలు విజయలక్ష్మి, ఇన్‌చార్జి, వివిధ శ్రేణుల నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.


కడియంలో ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తున్న గిరజాల వీర్రాజు దంపతులు

బాధ్యతా సంస్థ ఆధ్వర్యంలో..

కడియం: క్రోధినామ సంవత్సరం సర్వజన హితం కావాలని బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్య క్షుడు గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక హైస్కూల్ గ్రౌం డ్‌లో గిరజాల కృష్ణారావు కళావేదికపై ఉగాది వేడు కలు నిర్వహించారు. వీర్రాజు, రామకృష్ణతులసి దంపతులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. ఈ సం దర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన, సమాజా నికి సేవలందిస్తున్న 12 మందికి గిరజాల కృష్ణా రావు విశిష్ట సేవా ప్రతిభా పురస్కారాలతో సత్కరిం చారు.

ఘనంగా ఉగాది వేడుకలు

మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు ఉదయాన్నే పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. కడియంలోని భ్రమరాం బికా మల్లేశ్వరస్వామి, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని పలు ఆలయాలను, దుళ్లలోని శ్రీ భూ సమేత వేంక టేశ్వర స్వామివారి ఆలయం, బాలాత్రిపుర సుం దరీ సమేత అగస్త్యేశ్వరాలయాలను భక్తులు పెద్దఎ త్తున దర్శించుకున్నారు. కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరాలయం, ఆంజనేయ స్వామివారి సత్రం వద్ద, పల్లాలమ్మవారి ఆలయాల వద్ద పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు.